క్లుప్తంగా

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న ఎస్‌ఐ రామారావు

జి.సిగడాం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ సి.హెచ్.రామారావు సూచించారు. జి.సిగడాం మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన దిశ యాప్‌ను ప్రతి మహిళా డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా కోడి పందాలు, జూదం శిబిరాలు నిర్వహిస్తే అటువంటి వాటిపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. పల్లెల్లో కొంత మంది ఆకతాయిలు బాలికలను ఇబ్బంది పెడితే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సచివాలయంలో ఉన్న మహిళా పోలీసులకు అయినా సమాచారం ఇవ్వాలన్నారు.

కషాయాలతో తెగుళ్ల నివారణ

ఎచ్చెర్ల క్యాంపస్: కషాయాలతో తెలుగుళ్ల నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ గున్నంనాయుడు అన్నారు. కేశవరావుపేటలో కషాయాల వినియోగం, తయారీ, తెగుళ్ల నివారణపై మహిళా రైతులకు ఆదివారం శిక్షణ ఇచ్చారు. నీమాస్త్రం, అగ్నిఆస్త్రం, బ్రహ్మ ఆస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. పురుగు మందులు, రసాయన ఎరువులు తక్కువ మోతాదులో వాడాలన్నారు.

ధర్మాన్ని ఆచరించాలి


సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని ఆముక్తమాల్యద రచయిత శ్రీకృష్ణదేవరాయలు తన గ్రంథంలో తెలిపారని తెలుగు పండితులు డాక్టర్ పి.వి.ఎస్.సాయిప్రసాద్ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆముక్త మాల్యద–అతిథి సేవనంపై ఆదివారం ప్రసంగం జరిగింది. కృష్ణదేవరాయలు రాజుగా ఉంటూ కవిత్వాన్ని రచించారని గుర్తు చేశారు. విష్ణుచిత్తుడు పాత్ర ద్వారా ధర్మాన్ని పాటించాలని లోకానికి చాటి చెప్పారన్నారు. ఈ సందర్భంగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. సభ్యులు జంధ్యాల శరత్‌బాబు, రామ్‌మనోహర్, ఈశ్వరరావు, జనార్దనరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.80 కోట్లతో ప్రభుత్వ భవనాలు

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుమారుగా రూ.80 కోట్లతో 99 సచివాలయాలు, 99 రైతు భరోసా కేంద్రాలు, 86 హెల్త్ క్లినిక్ భవనాల పనులు చేపడుతున్నామని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ సీతంనాయుడు, ఏఈఈ శ్రీవల్లి వెల్లడించారు. మండలంలోని పెంట, జి.సిగడాం, గ్రామాల్లో పలు పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తింగా లావేరు మండలంలో 14 సచివాలయాలు, 3 ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్ సెంటర్లు ప్రారంభం చేశామన్నారు. జి.సిగడాం మండలంలో 17 సచివాలయాలు, 11 ఆర్‌బీకేలు, 8 హెల్త్ క్లినిక్ కేంద్రాలను పూర్తిచేసి ప్రారంభించామన్నారు. రణస్థలం మండలంలో 16 సచివాలయాలు, 5 ఆర్‌బీకేలు, 4 హెల్త్ క్లినిక్ సెంటర్లు, ఎచ్చెర్ల మండలంలో 16 సచివాలయాలు, 5 ఆర్‌బీకేలు, 4 హెల్త్ కేంద్రాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరో నెల రోజుల్లో భవనాల పనులను పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామన్నారు. జి.సిగడాంలో 80 శాతం మేర పనులు పూర్తిచేశామన్నారు.

ఐపీఎస్ బీవీ రమణ సేవలు స్ఫూర్తిదాయం


రమణను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: యువతీ యువకులు దేశ రక్షణలో భాగస్వామ్యమయ్యేలా, త్రివిధ దళాలు, పారామిలిటరీ ద్వారా దేశానికి సేవ చేసేలా వారిని అన్ని విధాలుగా సంసిద్ధులు చేయిస్తున్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ బీవీ రమణ సేవలు స్ఫూర్తిదాయకమని విజయనగరం పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పి.టి.ఆనందబాబు కొనియాడారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకొని మాతృదేవో భవ స్వచ్ఛందసంస్థ, ఎస్‌వీఎస్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో విజయనగరంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదల అగ్నిపథ్ ఫలితాల్లో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థకు చెందిన 82 మంది అగ్నిపథ్‌కు ఎంపిక కావడం, వారికి ఆ విధంగా శిక్షణ అందించి ఉద్యోగాలు సాధించేలా కృషి చేసిన రమణ సేవలను కొనియాడుతూ అభినందనలు తెలియజేశారు. విజయనగరం సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ మజ్జి కృష్ణారావు, లోక్‌సత్తా పూర్వవేదిక అధ్యక్షులు బీశెట్టి బాబ్జి పాల్గొన్నారు.

జగన్మాతా కాపాడమ్మా

- ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు
- పలు చోట్ల దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠ
- ఉత్సాహంగా ఊరేగింపులు
- అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఏపీహెచ్‌బీ కాలనీలో దుర్గాదేవిని ఊరేగిస్తున్న యువకులు


దేలండ్‌నైట్ కూడలి వద్ద టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఊరేగింపు


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మతల్లి

శ్రీకాకుళం కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గామాత విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాల్లో కొలువు తీర్చారు.

- శ్రీకాకుళం పట్టణంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద కనకదుర్గా టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగించారు. ఏడు రోడ్ల కుడలి వద్దగల జైదుర్గా టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించి వేదిక వద్దకు తీసుకువచ్చారు. మండపాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లా పరిషత్ వెనుక ఉన్న ఏపీహెచ్‌బీ కాలనీలో కూడా దుర్గాదేవి అమ్మవారిని కమిటీ సభ్యులు భవానీ మాలలతో ఊరేగింపుగా తీసుకువచ్చి మండపంలో ప్రతిష్ఠించారు. కోట ఆంజనేయస్వామి ఆలయం వద్ద కూడా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమైనాయి. బలగ హడ్కోకాలనీ పార్కు వద్ద నవదుర్గలను ఏర్పాటు చేసి పూజలు ప్రారంభించారు.

అమ్మవారికి పూజలు

పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సావాలను పురస్కరించుకొని ప్రారంభంలో భాగంగా రాజరాజేశ్వరీ దేవి అమ్మ వారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి పూజలు చేశారు. చండీ హోమాన్ని ప్రారంభించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణ జరిగింది.

- పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మావారి ఆలయంలో, నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవికి కలశ స్థాపన చేసి పూజలు ప్రారంభించారు. పెద్దబరాటం వీధిలో వెలసి నీలమ్మతల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ అధ్యక్షులు బరాటం సాయిరాజ్ ఆధ్వర్యంలో, గోవిందనగర్‌కాలనీలోని రాజరాజేశ్వరీ దేవికి ఆలయ ధర్మకర్త మొదలవలస ఉషారాణి, జగన్మోహనరావు దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. కర్రావీధిలోని వన దుర్గా అమ్మవారికి అలంకరణ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బొందిలీపురంలోని తుల్జాభవానీ అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మొండేటివీధి షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో లలితాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని బాల త్రిపురసుందరిగా అలంకరణ చేశారు. కలశస్థాపన చేసి భవానీ మాల దీక్షాధారణలు చేశారు.

దేవీపీఠాలో..

కత్తెరవీధిలోని రాజరాజేశ్వరీ దేవీ పీఠం నిర్వాహకులు సుసరాపు లక్ష్మీ గణపతిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. గుడివీధిలోని వైదిక ధర్మ ప్రచార పీఠం నిర్వాహకులు వేదుల రఘుశంకరశాస్త్రి ఆధ్వర్యంలో, గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ దేవీపీఠంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్ర శేఖరశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

లావేరులో..

లావేరు: మండలంలో కనకదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. లావేరులోని కనకదుర్గ ఆలయంలో దుర్గాదేవి బాల త్రిపురసుందరదేవి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త, శ్రీకాకుళం తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు, నిడిగంట్ల త్రినాథ్‌లు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పాతకుంకాం, లావేరు, రావివలస, బుడుమూరు, చినమురపాక, తామాడ, బొంతుపేటతోపాటు పలు గ్రామాల్లో సరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

దేవీ ఆలయంలో..

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవీ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలు చేపట్టారు. సుహాసినీలు కుంకుమార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

శరన్నవరాత్రులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని దేర్గాదేవి ఆలయాలు, గ్రామాల్లో ఆదివారం శరన్నవరాత్రుల ప్రారంభమయ్యాయి. కుశాలపురం, కేకేపేట, ఫరీదుపేట కొయ్యరాళ్ల ప్రాంతాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకిరించి పూజలు చేశారు. ఎచ్చెర్ల, చిలకపాలెం, కుశాలపురం, పూడివలస గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక, కుంకుమ పూజలు నిర్వహించారు. భవానీ భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

జి.సిగడాంలో..

జి సిగడాం: దేవీ నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో దుర్గాదేవిని భవానీ భక్తులు నెలకొల్పారు. భక్తిశ్రద్ధలతో దేవీని పూజించారు.

రణస్థలంలో..

రణస్థలం: మండలంలోని అన్నీ గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల్లో దుర్గాదేవి పూజలందుకుంది. జే.ఆర్.పురం, కొండములగాం గ్రామాల్లో దేవీ విగ్రహాలకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, పాతర్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ టొంపల సీతారాం, అలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గుడివీధిలో రాజరాజేశ్వరీ అమ్మవారికి అలంకరణ


గారలో పూజలందుకుంటున్న అమ్మవారు

గారలో..

గార: మండల కేంద్రంలోని దుర్గాలయం దుర్గా శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు ధర్మారావు దంపతులు పూజలు చేశారు. బూరవెల్లి వైష్ణవీ దుర్గాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కొర్ని పోలమాంబ, చల్లపేట దుర్గాలయం, శ్రీకూర్మనాధాలయంలోని వైష్ణవీదుర్గ వద్ద పూజలు జరిగాయి.


కర్రావీధిలో వనదేవత అమ్మవారికి అలంకరణ


కాలభైరవ దేవాలయంలో అమ్మవారి అలంకరణ


నక్కవీధిలో పారిజాతం పూలతో ఉమాదేవి అమ్మవారు


హడ్కోకాలనీలో నవదుర్గామాతల ఏర్పాటు


రణస్థలం: జే.ఆర్.పురంలో దుర్గాదేవిని పూజిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


రణస్థలం: పాతర్లపల్లిలో దుర్గాదేవిని పూజిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్


లావేరు: లావేరులోని కనకదుర్గ ఆలయంలో దుర్గాదేవి అమ్మవారు


ఎచ్చెర్ల: దేవీ ఆశ్రమంలో పూజలను నిర్వహిస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


జి.సిగడాం: ఎస్‌పీఆర్‌పురంలో యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం

ఘనంగా నవ చండీయాగం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గోల్కొండరేవు రోడ్డులో ఉన్న ఉమాజీవేశ్వరస్వామి దేవాలయం(బోడెమ్మకోవెల)లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శక్తి పంచాయతన సహిత నవ చండీయాగం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముందుగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వివిధ పూజలు జరిగాయి. రంగాభట్ల శ్రీనివాస శర్మ, ముక్కవిల్లి సూర్యప్రకాశ శర్మ, మంధెన్న లక్ష్మీనారాయణ శర్మల ఆధ్వర్యంలో చండీయాగం జరిగింది. ఆలయ అర్చకులు గంధం వెంకటరావు, ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు బి.వెంకటరావు, టి.చంద్రశేఖర్, టీఈ రవీంద్ర, సీహెచ్ గాంధీ, బి.లక్ష్మణరావు ఉన్నారు.

మహోన్నత వ్యక్తి అబ్దుల్‌కలాం


ఎచ్చెర్ల క్యాంపస్: కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు


శ్రీకాకుళం అర్బన్: అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మందిర కమిటీ సభ్యులు


శ్రీకాకుళం పాతబస్టాండ్: నివాళులర్పిస్తున్న న్యాయవాదులు


శ్రీకాకుళం కల్చరల్: అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: సమాజంలోని అన్ని వర్గాల మనసు గెలుచుకున్న మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అని గాంధీ మందిర కమిటీ వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్య్ర సమరయోధుల స్మృతి వనంలో కలాం 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహ దాత బరాటం లక్ష్మణరావుతో పాటు వివిధ రంగాల ప్రముఖులు నిక్కు అప్పన్న, పైడి హరనాథ్‌రావు, మహిబుల్లా ఖాన్, డాక్టర్ మధు విలేకర్, కొంక్యాన వేణుగోపాల్ బృందం కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు మెట్ట అనంతం భట్లు, పందిరి అప్పారావు, మందపల్లి రామకృష్ణ, వావిలపల్లి జగన్నాథం నాయుడు, హారిక ప్రసాద్, తర్లాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: అబ్దుల్ కలామ్ జయంతిని జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శాంతినగర్ కాలనీలోని స్వాతంత్య్ర సమర యోధుల పార్కులో ఉన్న కలామ్ విగ్రహానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, సభ్యులు పైడి జోగారావు, బి.వి.రమణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): అబ్దుల్ కలామ్ జయంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళం హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ మందిరం వద్ద నిర్వహించారు. కలాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కె.ఎస్.వి.ప్రసాద్ (హారికా ప్రసాద్), క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథంనాయుడు, సంఘసేవకులు శాస్త్రి, జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు, తర్లాడ అప్పలనాయుడు, బరాటం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కాలం జయంతిని ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కాలాం జీవిత చరిత్రను గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖరరావు విద్యార్థులకు వివరించారు. కలాంను ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: భారత మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు పిట్ట చంద్రపతిరావు అధ్యక్షతన ఆదివారం మహాత్మా జ్యోతిరావు పూలే పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విగ్రహదాత నక్క శంకరరావు, మాజీ కౌన్సిలర్ డి.మల్లిబాబు, గుత్తు చిన్నారావు, ఎ.రాంబాబు, ఎల్.నాగరాజు, పి.శ్రీధర్, పి.గోవిందరావు, కె.వేణు పాల్గొన్నారు.

శ్రీకూర్మం భక్తులకు మౌలిక సదుపాయాలు

శ్రీకాకుళం అర్బన్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మం దేవస్థానంలో భక్తులకు అవసరమైన వసతులు, మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ముందుంటుందని ఆ క్లబ్ అధ్యక్షుడు యెరుకోల మురళీమోహన్‌రావు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకూర్మనాథ క్షేత్రంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా.. ఉన్న ప్రజలతోపాటు వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశ విదేశాల నుంచి శ్రీకూర్మం క్షేత్రాన్ని సందర్శించేందుకు తరలివస్తూ ఉంటారని తెలిపారు. ప్రపంచంలోనే ఏకైక శ్రీ కూర్మనాథ స్వామి క్షేత్రం కావడం వలన భక్తుల రద్దీ అధికంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి అవసరమైన వివిధ వసతులను సమకూర్చనున్నట్లు మురళీమోహన్‌రావు తెలిపారు. ఈ విషయమై కూర్మనాథ క్షేత్రం సూపరింటెండెంట్, అర్చకులతో మాట్లాడడం జరిగిందని చెప్పారు. భక్తులు స్నానాలు చేసేందుకు మంచి నీటి పైపులైన్లు, పెద్దలకు పిండ ప్రదానం చేసేందుకు అవసరమైన సౌకర్యాలను తమ క్లబ్ తరపున ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయం సూపరింటెండెంట్ నర్సిబాబు, క్లబ్ ప్రతినిధులు కె.వి.ఎన్.దుర్గారావు, కేటి నాయుడు, బరాటం శ్రీరామ్మూర్తి, పి.వాసుదేవరావు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు గ్లాసుల బిల్డ్ ఆటల పోటీలు జరిగాయి. 30 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా.. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

దుర్గాదేవికి పూజలు

శ్రీకాకుళం అర్బన్: దసరా శరన్నవరాత్రులు సందర్భంగా శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సూర్యా ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అమ్మవారు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ దానేటి శ్రీధర్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఎల్.సింహాచలం, సభ్యులు జె.శ్రీనివాసరావు, డి.వి. రాజు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎచ్చెర్ల క్యాంపస్: పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు


లావేరు: లావేరు గ్రంథాలయంలో కథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: దసరా సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల గ్రంథాలయాధికారి జి.నిలమ్మ అన్నారు. గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా ప్రత్యేక అవగాహన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా గ్రంథాలయానికి వచ్చి నచ్చిన పుస్తకాలు చదవాలని సూచించారు. కథలు పుస్తకాలు విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

లావేరు: దసరా సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లావేరు, మురపాక శాఖాగ్రంథాలయాధికారులు ఎం.శ్రీనివాసరావు, టి.రాంబాబు అన్నారు. లావేరు గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. మురపాక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా 'వేణుగోపాలస్వామి' వార్షికోత్సవం


బృందావనం సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

గార: వేణుగోపాలస్వామి భక్తి స్వరాంజలి గ్రూపు తృతీయ వార్షికోత్సవాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. జొన్నలపాడు కాలనీ సమీపంలోని బృందావనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా వేణుగోపాలనుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రూపు వ్యవస్థాపకుడు భానుప్రకాష్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, గుణుపూర్ జిల్లాల నుంచి 80 మంది గాయకులు భక్తి పాటలతో పాటు దుర్గాదేవి గీతాలను ఆలపించారు. బృందావనం వ్యవస్థాపకులు చౌదరి దుర్గారావు దంపతులు, భానుప్రకాష్ రెడ్డి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దిలీప్ పండా, అనంతస్వామి, అల్లు కేశవరావు, చౌదరి శ్రీనివాసరావు, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు రుప్ప శ్రీనివాసరావు, అంబటి చక్రధరరావు, అంబటి చినబాబు, అలదు గోవింద్, ఈశ్వరరావు, రామకృష్ణ, తంగి అప్పన్న స్వామి పాల్గొన్నారు.